క్లుప్తంగా...

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా.13, నల్లవంకాయ 15, పొడుగు వంకాయ 15, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 24, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 25, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 19, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 23, చామగడ్డ 50, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

డాక్టరేట్ ప్రదానం


నర్సింహ్మా కన్నన్

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ నగర ప్రధాన కార్యదర్శి నర్సింహ్మా కన్నన్ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. అమెరికా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. శుక్రవారం రాత్రి పూణేలోని సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటిలో జరిగిన కార్యక్రమంలో కన్నన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆయనను సత్కరించి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కన్నన్ మాట్లాడుతూ.. సామాజిక సేవ కార్యక్రమాలకు అమెరికా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ అంతర్జాతీయ సంస్థ నుంచి గౌరవ డాక్టరేట్ పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ సాంగ్ వాన్ పార్క్, రిజిస్ట్రార్ క్యూంగ్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బౌద్ధనగర్: ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుండా యాదగిరి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం రవాణా శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యమ సమితి నాయకుడు పాండుగౌడ్, సత్యనారాయణ, శంకరయ్య తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు


పొట్లకాయల వెంకటేశ్వర్లు

అడ్డగుట్ట: రాష్ట్రంలో వెనుకబడిన కులాలను గుర్తించి కులగణన తీర్మానం అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామని అఖిల భారత ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లుముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. గత పాలకులు బీసీలను సామాజిక, రాజకీయంగా ఎదగనివ్వకుండా అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణనతో అన్ని కులాల వారు సామాజిక, రాజకీయంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

కేంద్ర పథకాలు పేదలకు శ్రీరామరక్ష


మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడుతున్న మల్కా కొమురయ్య

కంటోన్మెంట్: కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదల సంక్షేమానికి శ్రీరామ రక్ష అని బీజేపీ నేత మల్కా కొమురయ్య అన్నారు. మారేడుపల్లి టీచర్స్ కాలనీ, నెహ్రూనగర్ పార్కులో శనివారం ఉదయం మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల వల్ల దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ అభివృద్ధిలో తాను సైతం భాగం కావాలన్న కాంక్షతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. బీజేపీ అధిష్టానం అవకాశమిస్తే తాను మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి ఎన్నికల బరిలో ఉంటానన్నారు. తాను గెలిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తానన్నారు. పెద్దపల్లి జిల్లాలోని మారుమూల పల్లె నుంచి వచ్చిన తాను నగరంలో పల్లవి, డీపీఎస్ విద్యాసంస్థల స్థాపనతో పాటు పల్లవి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని వివరించారు. కంటోన్మెంట్ స్థానికుడిగా ఇక్కడి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు.

నేడు సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ ప్రారంభం



- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.1.5 కోట్లతో కిమ్స్ ఆస్పత్రి నిర్మాణం

సనత్‌నగర్: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నూతనంగా నిర్మించిన సనత్‌నగర్ అగ్నిమాపక కేంద్రం సొంత భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా దీనిని ప్రారంభించనున్నారు. గత ఆరు దశాబ్దాలుగా ఫైర్‌స్టేషన్‌కు సొంతం భవనం లేక అగ్నిమాపక యంత్రాలకు, ఇటు సిబ్బంది వసతికి ఇబ్బందికర పరిస్థితులన అనుభవిస్తూ.. వస్తున్నారు. ఎట్టకేలకు టీఎస్ ఐఐసీ ముందుకొచ్చి 1000 చదరపు మీటర్ల స్థలాన్ని ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన విషయం తెలిసిందే. సీఎస్ఆర్ కింద పలు కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చి భవన నిర్మాణంలో పాలుపంచుకున్నాయి.

- భవనం సెల్లార్‌లో పార్కింగ్‌తో పాటు భవన సర్వీసులు ఉంటాయి. గ్రౌండ్, మొదటి ఫ్లోర్‌లో ఫైర్‌స్టేషన్, రెండో ఫ్లోర్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్, రీజనల్ ఫైర్ ఆఫీసర్, మూడో ఫ్లోర్‌లో డైరెక్టర్ జనరల్ సెక్షన్, అడిషనల్ డైరెక్టర్స్, నాలుగో ఫ్లోర్‌లో డైరెక్టర్ జనరల్ అండ్ బోర్డు రూమ్‌ను ఏర్పాటుచేశారు.
- భవనంలోని అన్ని అంతస్తులు కలుపుకొని 28,653 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. ప్రస్తుతం స్టేషన్ ఫైర్ ఆఫీసర్, లీడింగ్ ఫైర్‌మెన్, డ్రైవర్ ఆపరేటర్స్, ఫైర్‌మెన్‌లతో సహా 35 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.
- 1964 నుంచి సనత్‌నగర్ కేంద్రంగా ఫైర్ సరీ్వసులు కొనసాగుతున్నాయి. 2023లో రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖ అనుమతుల మేరకు కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం సీఎస్ఆర్ కింద రూ.1.5 కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించారు.

ముగిసిన తెలుగు సాహిత్య మహాసభలు


వేదికపై రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరిగిన తెలుగు సాహిత్య మహాసభలు శనివారం ముగిశాయి. ఆర్ట్స్ కాలేజీ 133 తరగతిలో జరిగిన ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడు రోజుల పాటు వివిధ అంశాలపై జరిగిన సమావేశాల్లో అనేక అంశాలను ప్రస్తావించారు. దేశ వ్యాప్తంగా 25 వర్సిటీల తెలుగు విభాగం అధ్యాపకులు పాల్గొని వర్తమాన తెలుగు భాష సాహిత్యం గమనం, గమ్యం తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, రచయితలు, అధ్యాపకులు, సినీ దర్శకులు, పత్రిక సంపాదకులు, పరిశోధన విద్యార్థులు తదితరులు కవితా పొద్దులో పాల్గొని భాష, సాహిత్యంపై కథలు, కవిత్వం, ఆట, పాటలతో ఆలోచింపచేయగా 300 మంది ప్రతినిధులు హాజరైనట్లు నిర్వాహకులు ప్రొ.కాశీం తెలిపారు.

ఆదయ్య స్మారక ప్రభుత్వ పాఠశాలలో 'వికసిత్ భారత్'


కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కార్పొరేటర్ సుచిత్రాశ్రీకాంత్

పద్మారావునగర్: సికింద్రాబాద్ ఓల్డ్ గాస్‌మండిలోని ఆదయ్య ప్రభుత్వ స్మారక పాఠశాల ఆవరణలో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు స్టాళ్లను ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ చీర సుచిత్రాశ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు దేశాన్ని ప్రగతి పథంలోకి నడిపించడానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, నరేందర్ పాల్, మనోహర్, శ్రీనివాస్ గౌడ్, చీర శ్రీనివాస్, మనోజ్, దుర్గాప్రసాద్, ప్రవీణ్, నిర్మలా, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



సికింద్రాబాద్: అప్పులు ఎక్కువ కావడం, అనారోగ్యం బారిన పడటంతో జీవితంపై విరక్తి చెందిన ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..మేడ్చల్ శివానగర్‌కు చెందిన దాసరి సంతోష్‌కుమార్ (47) ఆటోడ్రైవర్. ఆటోనడపడంతో వచ్చే ఆదాయం సరిపడక అప్పులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. చివరకు కిడ్నీలు చెడిపోవడంతో తీవ్ర అనారోగ్యం చేకూరింది. దీంతో విరక్తి చెందిన సంతోష్‌కుమార్ భూదేవినగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్: బీఆర్ఎస్ హయాంలో అమలులోకి తీసుకొచ్చిన ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కోరారు. శనివారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు పార్టీలు మారుతున్న విషయమై స్పందించిన పద్మారావుగౌడ్ రాజకీయ నిబద్ధత లేని నాయకులు మాత్రమే పార్టీలు మారుతారని చెప్పారు. తనకు తన అనుచరులకు అలాంటి అవసరం లేదన్నారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, సుంకు రాంచందర్, జలందర్‌రెడ్డి, రాజసుందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

20 నుంచి సామూహిక కుంకుమార్చనలు



రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు మహిళా సత్సంగ్ బృందం నిర్వహిస్తారని చెప్పారు. రూ.3501 కట్టిన వారికి సుహాసినీ పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 20న అమ్మవారిని, గర్భగుడిని కూరగాయలతో, 21న డ్రైఫ్రూట్స్‌తో, 22న 108 చీరలతో, 23న గాజులతో, 24న అన్ని రకాల పూలతో అలంకరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కిషోర్‌కుమార్, జగదీష్‌ప్రసాద్‌వర్మ, కేఎం కృష్ణ, అరుణ్‌భట్, విశ్వనాథం, మహేందర్, రామ్మోహన్ ప్రధాన అర్చకులు రామతీర్థశర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుంకుమార్చన కరపత్రాన్ని విడుదల చేశారు.

మహిళా సాధికారత సాధించాలి


మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని సమాజం గర్వించేస్థాయికి ఎదగాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా బేగంపేట మయూరి మార్గ్‌లో శనివారం 40 మంది మహిళలకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో కొనుగోలు చేసిన కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు నేడు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగాలన్నారు. కుట్టు మిషన్ల ద్వారా తాము నేర్చుకున్న విద్యలో మరింతగా రాణించి ఆర్థికంగా వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తాను ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానన్నారు. బేగంపేట డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తిచేశామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మహిళా సాధికారత సాధించాలనే ఉద్దేశంతోనే వారి ఉపాధి కోసం కుట్టుమిషన్లను పంపిణీ చేశామన్నారు. కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, సత్యనారాయణ, సామల పాండు, నారాయణ తదితరులున్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు


ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్యగౌడ్, మనోహర్, ఎల్లయ్య, రాజు, వసంత, అయోధ్య, అమర్, యాదగిరి, దేవయ్య, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మథర్ థెరిసా ఫౌండేషన్‌లో..

రసూల్‌పురా: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 70 వ పుట్టినరోజు వేడుకలు కార్ఖానా ఆర్‌కే ఫౌండేషన్ మదర్ థెరిసా వృద్ధుల అనాథాశ్రమంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ ఆధ్వర్యంలో వీల్ చైర్లు, దుప్పట్లు, మందులు, పండ్లు పంపిణీ చేసిన అనంతరం వారితో కేక్ కట్ చేయించారు. తాడ్‌బంద్ హనుమాన్ ఆలయంలో కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామకృష్ణ, శ్యామ్, చందు, రావుల సతీష్ పాల్గొన్నారు.

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో మథర్‌థెరిసా ఫౌండేషన్‌లో వృద్ధులకు భోజనం పండ్లు పంపిణీ చేసి కేక్‌కట్ చేశారు. శేఖర్ ముదిరాజ్, సదానంద్, గోపికృష్ణ, సిద్దార్థ్, రాజేష్, క్రాంతి కార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, పలువురు బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం ఎదుట బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

ఓయూలో కేసీఆర్ జన్మదిన వేడుకలు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో మాజీ సీఎం కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించిన కార్యక్రమానికి బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ కేక్ కట్ చేసి మొక్కను నాటారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందచేసి, ఆర్టీసీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కడారి స్వామి, అవినాష్, చటారి దశరథ్, వెంకటేష్, జంగయ్య, మేకల రవి, మిథున్, శ్రీనే, సురేష్ తదితరులున్నారు.

బన్సీలాల్‌పేట్: బాన్సీలాల్‌పేట్‌లో కార్పొరేటర్ కె. హేమలత పార్టీ శ్రేణుల మధ్య కేక్‌కట్ చేశారు. దేవనార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని అంధుల కళాశాలలో పండ్లు పంపిణీ చేశారు. లక్ష్మీపతి, ప్రేమ్, అరుణ్ తదితరులున్నారు.

అన్నదానం..

సనత్‌నగర్: బీకేగూడ శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సేవా సమితి ట్రస్టీ పార్థసారథి ఆధ్వర్యంలో హుస్సేన్‌రెడ్డి సహకారంతో ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో సుమారు 150 మందికి అన్నదానం చేశారు. కృష్ణారెడ్డి, సత్యనారాయణ, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, ఆర్‌సీకుమార్ పాల్గొన్నారు.


వృద్ధులకు వీల్‌చైర్లు అందజేస్తున్న గజ్జెల నాగేష్


కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సీఎం రేవంత్‌ను కలిసిన స్థానిక నేతలు


సీఎంతో కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులు

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు, కంటోన్మెంట్ సీనియర్ నాయకులు అల్లాడి గౌరీ శంకర్ తదితర సీనియర్ కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌లో గత 32 ఏళ్లుగా పనిచేస్తున్నామని సీఎంకు వారు వివరించారు. పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని, వారి సేవలను ప్రభుత్వం, పార్టీ పరంగా తప్పకుండా ఉపయోగించుకుంటామని సీఎం తెలిపారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కలిసికట్టుగా నాయకులు, కార్యకర్తలు పనిచేసి మల్కాజిగిరి పార్లమెంటును కాంగ్రెస్ పార్టీ కైవసం చేసికునేలా చూడాలన్నారు. సీనియర్ నాయకులు నందికంటి రవి, బాబూరావు, శ్రీనివాస్, శివకుమార్ తదితరులున్నారు.

గృహ కార్మిక సంఘం నేతల సమావేశం



బౌద్ధనగర్: వారాసిగూడలో గృహకార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్ర ముఖ్య నేతల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వల్లాల మంజుల గృహ కార్మికుల సమస్యలపై చర్చించారు. లేబర్ కోడ్‌లు ఉపసంహరించి, లేబర్ చట్టాలను పునరుద్ధరించాలన్నారు. సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం కోసం 3 శాతం సెస్ వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో–ఆర్డినేటర్ సిస్టర్ లూర్డ్, హైద్రాబాద్ జిల్లాలోని 60 మంది గృహ కార్మికుల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందుకున్న విద్యార్థులతో మలబార్ ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 45 మంది పేద మెరిట్ విద్యార్థులకు శనివారం హబ్సిగూడకు చెందిన మలబార్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు రూ.3.80 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యర్థులకు సామాజిక చేయూతను అందించి ప్రోత్సహించడం కోసం ఆర్థిక సహాయాన్ని అందించినట్టు మలబార్ చారిటబుల్ ట్రస్టు మేనేజర్ ఎండీ సోఫీ తెలిపారు. ఏటా మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం, డాక్టర్ అనుపమ, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు సరికాదు

చిక్కడపల్లి: క్రైస్తవులపై దాడులు చేయడం హేయమైన చర్య అని హెబ్రోను సొసైటీ సభ్యులు అన్నారు. జన్వాడలో జరిగిన ఘటనను వారు ఈ సందర్భంగా ఖండించారు. గోల్కొండ హెబ్రోన్ చర్చిలో శనివారం సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి మాట్లాడారు. ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన వారిని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

రైల్వే అకౌంట్స్ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం


రైల్వే అకౌంట్స్ 1984 బ్యాచ్ ఉద్యోగులు

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ 1984 రైల్వే అకౌంట్స్ బ్యాచ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం శనివారం సికింద్రాబాద్‌లో నిర్వహించారు. 40 ఏళ్ల క్రితం అనుభవాలు, అనుభూతులు, జ్ఞాపకాలు గుర్తు చేసుకొని సెల్ఫీలు దిగి ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, శ్రీ నాగేష్, బాల, శివకుమార్, రఘువేంద్రరావు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం



సాక్షి, సిటీబ్యూరో: క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని ఆసియా అథ్లెటిక్ క్రీడల్లో భారతదేశానికి సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారిణి కొరడా మృదుల అన్నారు. బోయినపల్లిలోని లిటిల్ ఐన్‌స్టీన్ ప్లే స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు శనివారం స్పెన్సర్ గ్రౌండ్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి మృదుల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫల్గుణి పాఠశాల ప్రిన్సిపాల్ సైనీ శాంతితో కలిసి ఒలింపిక్ టార్చ్ క్రీడా జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ డే క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భాంగా ఆమె మాట్లాడుతూ..క్రీడలు ఒత్తిడిని తగ్గిస్తూ విద్యార్థులు మానసిక స్థితిని పెంచుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.